

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా

కోనసీమ జిల్లా

తూర్పు గోదావరి జిల్లా

పోలవరం(రంపచోడవరం)జిల్లా

గురువారం,22 జనవరి 2026

8 పేజీలు






## నవ్వుతున్న భవిష్యత్తులో..

# నిప్పుల కొలిమి!

## లిక్కర్ కోటలో మృత్యుపాశాలు..



అగ్నిమాపక శాఖ పంచనామా నివేదిక










- ఫైర్ ఎన్ఓసీ లేకున్నా బార్‌కు పచ్చజెండా?
- ఒకే మెట్టు - వెయ్యి అపాయాలు
- 1.20 మీటర్ల ఇరుకు దారిలో ప్రాణగండం!
- అగ్నిమాపక శాఖ నివేదికతో ఎక్సైజ్ మాఫియా గుట్టురట్టు..
- కలెక్టర్ విచారణలో దిగ్భ్రాంతికర వాస్తవాలు

**కాకినాడ మెయిన్‌రోడ్డులో వెలుస్తున్న 'మెమొరీస్' బార్ అండ్ రెస్టారెంట్ లిక్కర్ కోట రేపటి రోజున అమాయక ప్రజలకు నిప్పుల కొలిమిగా మారబోతోందని అగ్నిమాపక శాఖ తనిఖీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నూతన ఎక్సైజ్ పాలసీ 2024-26 జీవో ఎంఎస్ నెంబర్ 209, 210 నిబంధనల ప్రకారం, బార్ లైసెన్స్ మంజూరుకు అగ్నిమాపక శాఖ నుండి ఆక్యుపెన్సీ ఎన్వోసీ పొందడంమరియు భవనభద్రత ప్రమాణాలు పాటించడం చట్టరీత్యా తప్పనిసరి. అయితే, నేషనల్ బిల్డింగ్‌కోడ్ ప్రకారం కమర్షియల్ భవనాలకు ఉండాల్సిన 2మీటర్లమెట్ల వెడల్పుకు విరుద్ధంగా, ఇక్కడ కేవలం 1.20 మీటర్ల ఇరుకు దారి మాత్రమే ఉండటం పెను ప్రమాదానికి సంకేతంగా కనిపిస్తోంది. హోస్ రీల్, స్ప్రింక్లర్లు వంటి ప్రాణరక్షణ పరికరాలేవీ పనిచేయడం లేదని అగ్నిమాపక శాఖ అధికారులు తేల్చి చెప్పినప్పటికీ, ఎక్సైజ్ అధికారుల ఉదాసీనతతో ఓపెన్ స్కైరూఫ్ టాప్‌బార్ మరియు రెండంతస్తుల్లో బార్ ఏర్పాట్ల పనులు వేగవంతం చేయడం వెనుక భారీ అవినీతి దాగి ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరోఅందించినక్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కథనాలకు కదిలిన యంత్రాంగం.. కలెక్టర్ ఆదేశాలతో గుట్టురట్టు.. కాకినాడ 'మెమొరీస్' బార్ వ్యవహారంలో 'సూర్య' పత్రిక అప్రమత్తంగా వ్యవహరించి, లిక్కర్ కోట బీటలు వారేలా వరుస కథనాలను అందించింది. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని సూర్య ప్రచురించిన పరిశోధనాత్మక కథనాలపై జిల్లా కలెక్టర్ భరత్ ఐఏఎస్ తక్షణమే స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అగ్నిమాపక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఆతనిఖీ నివేదిక ప్రకారం సదరు భవనం నిబంధనలు పాటించని ఒక మృత్యుపాశమని తేలిపోయింది.ఏపీ ఫైర్ సర్వీస్ యాక్ట్ 1999లోని సెక్షన్ 13ను తుంగలో తొక్కి,14.50 మీటర్ల ఎత్తున్న ఈ భవనానికి ఉండాల్సిన ఎక్స్‌టర్నల్ స్టెయిర్ కేస్

- తరువాయి 2లో..

## సామాజిక సేవా పథికుడికి

# సమున్నత గౌరవం!

గవర్నర్ 'ఎట్ హోమ్'కు సత్యం వాసంశెట్టికి ఆహ్వానం- నిస్వార్థ సేవకు నిలువుటద్దం..

- కష్టాల్లో ఉన్నవారికి కొంగుబంగారం..





**"సమాజమే దేవాలయం..సేవయే పరమావధిగా భావించి, కష్టాల్లో ఉన్న పేదల కన్నీళ్లు తుడుస్తున్న మంచి మనస్సు ఆయనది. అట్టడుగువర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలోనూ, మహిళా లోకానికి ఆత్మగౌరవ శిక్షణలోనూ ఆయన చేస్తున్న కృషిఅసాధారణం. తనసేవా పరిమళాలను కోనసీమ పొలిమేరలు దాటించి, ప్రతి గడపకూ ఓ భరోసాగా నిలిచిన వాసంశెట్టి సత్యం అన్న మానవత్వం నేడు రాజ్ భవన్ మెట్లెక్కింది. పదవుల కంటే ప్రజాక్షేమమే మిన్న అని చాటిన ఆ నిస్వార్థ సేవకుడికి గవర్నర్ 'ఎట్ హోమ్' ఆహ్వానంలభించడం, ఆయన నిరంతర సేవా యజ్ఞానికి దక్కిన సమున్నత గౌరవం. ఆపదలో ఉన్నవారికి అభయహస్తం అందించే ఆమంచి మనసుకు, రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ గుర్తింపు అభినందనీయం, అజరామరం."**

- మిగతా 2 లో..

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

## ఈతకోట బ్రిడ్జి పునర్నిర్మాణానికి

# రూ.2.90కోట్ల నిధులు మంజూరు

## - ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకఅభివృద్ధి పరుగులు పెడుతుందని, మౌలిక సదుపాయాల కల్పన మీద అధికంగా ప్రభుత్వం దృష్టి సారించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. ఈతకోట వద్ద గోరింకల డ్రైన్‌పైనాలుగు లైన్ల రహదారితో కూడిన బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ.2.90 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యేబండారు సత్యానందరావు తెలిపారు. నిధులు మంజూరు చేసిన నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే బండారు కృతజ్ఞతలు తెలియజేశారు.

త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక పనులు మొదలవుతాయని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతాయని, దేవరపల్లి వైపు భారీ వాహనాలు వెళ్లడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని ఆయన అన్నారు. ఈతకోట నుంచి వయాదేవరపల్లి మీదుగా కొత్తపేట రావడానికి వాహన దారులకు, ప్రజలకు అనువుగా ఉంటుందని తెలిపారు.

# నవ్వుతున్న భవిష్యత్తులో... నిప్పుల కొలిమి!

**మొదటిపేజీ తరువాయి**

లేకున్నా ఎక్సైజ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం విస్తుగొలుపుతోంది. సూర్య కథనాల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు మరొకసారి ఫిజికల్ వెరిఫికేషన్ రిపోర్టుపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ భవనం అసలు నిజాలను బయటపెట్టి వెంటనే బార్ లైసెన్స్ రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ఫైర్ ఆఫీసర్ రిపోర్ట్: అన్నీ 'నాట్ వర్కింగ్'!నో ఎన్‌వోసీ**

డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఆదేశాలతో అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ నిర్వహించిన పంచనామా తనిఖీలో 'మెమొరీస్' భవనం లిక్కర్ కోట ఒక డెత్ ట్రాప్ అని తేలిపోయింది.

**నివేదికలోని ముఖ్యాంశాలు ఇవే**

– ఇరుకు మెట్లు: నేషనల్ బిల్డింగ్ కోడ్ ప్రకారం కమర్షియల్ భవనాలకు మెట్లు 2 మీటర్ల వెడల్పు ఉండాలి. కానీ ఇక్కడ కేవలం 1.20 మీటర్లు మాత్రమే ఉన్నాయి. ప్రమాదం జరిగితే వందలాది మంది కిక్కిరిసిపోయి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం ఖాయం.

**– ఎక్విప్మెంట్ ఫెయిల్యూర్:** హోస్ రీల్, వెట్ రైజర్, స్ప్రింక్లర్ సిస్టమ్, పంపులు.. ఇలా ఒక్కటీ పనిచేయడం లేదు. అన్నీ 'నాట్ వర్కింగ్' అని నివేదికలో ఎర్ర అక్షరాలతో అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ క్లియర్‌గా పంచనామా **రిపోర్ట్ రాశారు. అయినా మేలుకోలేరా.!**

– బయటి మెట్లు లేవు: 15 మీటర్ల ఎత్తుకు చేరువలో ఉన్న భవనానికి ఖచ్చితంగా వెలుపలి మెట్లు ఉండాలి. కానీ ఇక్కడ ఆ నిబంధనను గాలికి వదిలేశారు.

**చట్టం ఏం చెబుతోంది?**

– ఏపి ఫైర్ సర్వీస్ యాక్ట్ 1999 సెక్షన్ 13: ఏదైనా వాణిజ్య భవనం, ముఖ్యంగా బార్ అండ్ రెస్టారెంట్ వంటివి నడపాలంటే అగ్నిమాపక శాఖ నుండి హైరైజ్ భవంతికి ఖచ్చితంగా 'ఆక్యుపెన్సీ ఎన్‌ఓసి' ఉండాలి.

– బార్ లైసెన్స్ మంజూరు చేసే ముందు, ఆ భవనం ప్రజల భద్రతకు అనుకూలంగా ఉందా లేదా అని ఎక్సైజ్ అధికారులు సరిచూడాలి. ఫైర్ సేఫ్టీ లేని చోట లైసెన్స్ ఇవ్వడం క్రిమినల్ నిర్లక్ష్యం కిందకు వస్తుంది.

**విజయవాడ 'స్వర్ణ ప్యాలెస్' పాఠాలు మర్చిపోయారా?**

గతంలో విజయవాడలో జరిగిన స్వర్ణ ప్యాలెస్ అగ్నిప్రమాదంలో అమాయకులు సజీవ దహనమయ్యారు. ఇప్పుడు కాకినాడలోనూ అచ్చు అటువంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. అగ్నిమాపక శాఖ 'ఎన్‌ఓసి' లేదని, ఎక్విప్మెంట్ పనిచేయడం లేదని తేల్చి చెప్పినా.. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ వాడుకలో ఉందని సాకులు చెబుతూ, లోపల ఇంటీరియర్ వర్క్ పేరిట బార్ పనులు సాగిస్తున్నారు. అంటే ప్రమాదం జరిగిన తర్వాత మేల్కొంటారా అని మేధావులు ప్రశ్నిస్తున్నారు.

**కలెక్టర్ గారూ.. ఆ ఫిజికల్ వెరిఫికేషన్ రిపోర్ట్ ఓ 'అబద్ధం'!**

జిల్లా కలెక్టర్ భరత్ ఐఏఎస్‌కి అందిన పిజిఆర్ఎస్ ఫిర్యాదుల నంబర్లు 283, 313, 314 నేపథ్యంలో, ఎక్సైజ్ అధికారులు ఇచ్చిన ఫిజికల్ వెరిఫికేషన్ రిపోర్టును రీ–వెరిఫై చేయాల్సిన అవసరం ఉంది. అగ్నిమాపక శాఖాధికారులు "సౌకర్యాలు లేవు" అని మొత్తుకుంటుంటే, ఎక్సైజ్ అధికారులు ఏ ధైర్యంతో ఆ భవనాన్ని బార్‌కు అనుకూలం అని రాశారు? దీని వెనుక ఉన్న 'మామూళ్ల' మాయాజాలంపై విచారణ జరిపి, ఆ అధికారిని వెంటనే విధులనుంచి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**నిప్పుతో చెలగాటం వద్దు!**

ఒకవైపు లిక్కర్ మాఫియా, మరోవైపు అవినీతి అధికారులు చేతులు కలిపి 'మెమొరీస్' లిక్కర్ కోటను నిర్మిస్తున్నారు. కానీ అగ్ని ప్రమాదం సంభవిస్తే ఇంత పెద్ద భవనానికి ఏకైక మెట్ల దారి ఈ 1.20 మీటర్ల మెట్లపై నుండి ప్రజలు ప్రాణాలతో బయటపడటం అసాధ్యం. నవ్వుతున్న భవిష్యత్తులో నిప్పులు పోయకండి. నిబంధనల ప్రకారం ఫైర్ ఎన్‌వోసీ వచ్చే వరకు, మెట్ల వెడల్పు పెంచే వరకు ఈ భవనానికి ఎట్టి పరిస్థితుల్లోనూ బార్ ఏర్పాటుకు లైసెన్స్ ఇవ్వకూడదని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా జరిగిన శ్రీ గోగులమ్మ జాతర మహోత్సవం

–జాతర మహోత్సవంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ ఏపీఐఐడిసి చైర్మన్ బూరుగుపల్లి శేషారావు



**పెరవలి,మేజర్‌న్యూస్ :** పెరవలి మండలంలోని ఉసులుమర్రు గ్రామంలో గ్రామదేవతశ్రీ గోగులమ్మ అమ్మవారి జాతరమహోత్సవాలు ఘనంగా జరిగాయి. జనవరి 20వ తేదీ మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి జాతర మహోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి సందడిచేశారు గ్రామంలో నెలకొన్న పండుగ వాతావరణం తిలకించి గ్రామస్తులకు భక్తులకు అమ్మవారి ఆశీస్సులు కలగాలని ఆయన ఆకాంక్షించారు. నిడదవోలు మాజీ శాసనసభ్యులు నిడదవోలు తెదేపా ఇంచార్జ్ ఏపీఐఐడీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు జాతర మహోత్సవంలో పాల్గొని గ్రామదేవత శ్రీ గోగులమ్మ అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముసలిమర్రు గ్రామంలో గోగులమ్మ వారి జాతర మహోత్సవాలు ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.ఈ క్రమంలో ఈ ఏడాది జాతర మహోత్సవాలు సంక్రాంతి తర్వాత బుధవారం నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయం మేరకు ఈ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. జాతర సందర్భంగా రాత్రి మేళ తాళాలు తీన్మార్ డప్పులు కాళికా నృత్యాలు గరగ నృత్యాలతో అంగరంగ వైభవంగాఅమ్మవారిని గ్రామంలోభారీ ఊరేగింపుతో గ్రామస్తులు బంధుమిత్రులు వీధి వీధిన ఊరేగించారు. జనవరి 21వ తేదీ బుధవారం అమ్మవారికి వివిధ రకాల వంటకాలను నివేదించను న్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ నైవేద్యాలు పెట్టుకుని గ్రామ ఆడపడుచులకు బట్టలు పెట్టడం బంధుమిత్రులకు స్నేహితులకు మాంసాహారంతో కూడిన విందు భోజనాలు పెట్టి వీడ్కోలు పలికారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన బంధుమిత్రులు గ్రామ ఆడపడుచులతో గ్రామం కలకల్లాడింది.

# సామాజిక సేవా పథికుడికి సమున్నత గౌరవం!

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సేవా కార్య క్రమాలతో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" అధినేత వాసంశెట్టి సత్యంని అరుదైన గౌరవం వరించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక "ఎట్ హోమ్" కార్యక్రమానికి హాజరు కావాలని రాష్ట్ర గవర్నర్ నుండి ఆయనకు ప్రత్యేక ఆహ్వానం అందింది. జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఈ మేరకు అధికారికంగా ఆహ్వాన పత్రికను అందజేశారు.

**సేవయే ఊపిరిగా..**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రిగా కంటే, వేలాది మంది పేదల పాలిట ఆపద్బాంధవుడిగా సత్యం వాసంశెట్టి నియోజకవర్గంలో పేరుంది. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవలు అపారం. ముఖ్యంగా:

– నిరుద్యోగ నిర్మూలన: మెగా జాబ్ మేళాల ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం.

– మహిళా సాధికారత: మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడంలో ఆయన కృషి అనన్యం.

– విద్య – వైద్యం: నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకుని ఉన్నత చదువులు చదివించడం, ఉచిత మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాల ద్వారా నిరుపేదల ఆరోగ్యాన్ని కాపాడటం.

– ఆసరా: వృద్ధులు, వికలాంగులకు ఆర్థిక చేయూతనిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడం.

మానవత్వానికి మారుపేరు... "మంచి మనసు, పేదల బాధలు తెలిసిన వ్యక్తి"గా పేరుగాంచిన సత్యం గారు, పదవుల కంటే ప్రజా సేవకే ప్రాధాన్యత ఇస్తారు. ఆయన సేవా గుణాన్ని గుర్తించి సాక్షాత్తు రాష్ట్ర గవర్నర్ గౌరవించడం పట్ల కోనసీమవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతు న్నాయి. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ గౌరవం కేవలం ఒక్క వ్యక్తికి దక్కినది కాదు, ఆయన నమ్ముకున్న 'సేవా ధర్మానికి' దక్కిన గౌరవమని స్థానికులు కొనియాడుతున్నారు.

# సంక్రాంతి సంబరాలు ముసుగులో ఎమ్మెల్యే అవినీతి

– ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



**అమలాపురం, మేజర్‌న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం తీర ప్రాంతంలో జరిగిన సంక్రాంతి సంబరాలలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సంచలన వ్యాఖ్యలు చేసారు. స్థానిక ప్రీతీ రెసిడెన్సీలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు సంక్రాంతి సంబరాల ముసుగులో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోట్లాది రూపాయలు వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారని అన్నారు. రెండు సంవత్సరాలుగా సంక్రాంతి సంబరాలు పేరుతో వసూలు చేసిన మొత్తాలను ఎంత ఖర్చు చేసారో, ఎంత మింగేసారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసారు. రైతుల నుంచి, అధికారుల నుంచి, వివిధ షాపింగ్ మాల్స్ నుంచి, కాంట్రాక్టర్ల నుండి పెద్ద మొత్తంలో నిధులు వసూలు చేశారన్నారు. వీటిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. గుండాట, కోడిపందాల బరులు నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి ఆ నగదును ఎమ్మెల్యేకి అందించి పోలీసులు బ్రోకర్లుగా మారిపోయారు అన్నారు. ప్రతి రైతు నుంచి ఎకరాకు 5 లక్షల రూపాయలు వసూలు చేశారు. ప్రతీ డిపార్ట్మెంట్ నుంచి అలాగే చిరు వ్యాపారస్తులనుండి 10 వేల రూపాయలు చొప్పున వసూలు చేశారు. ఎస్.యానాంలో జరిగిన సంక్రాంతి సంబరాలలో ఓ విలేఖరి అగ్ని ప్రమాదానికి గురై కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు అంటే అక్కడ ఏ రకమైన సౌకర్యాలు లేవని చెప్పడానికి నిదర్శనం అన్నారు. అమలాపురం ఆర్డీవో భర్త కాంట్రాక్టర్‌గా మారి పనులు చేయిస్తున్నారంటే వ్యవస్థను ఎంత దిగజార్చారో తెలుస్తుందన్నారు. గత 18 సంవత్సరాలుగా ఇద్దరు పంచాయతీరాజ్ డీఈ లు అమలాపురంలోనే స్థిరపడి పనిచేస్తూ లక్షల రూపాయలు అవినీతికి పాల్పడుతున్నారన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను మింగేస్తున్న ఆ ఇద్దరు అధికారుల అవినీతిని మరో రెండు రోజుల్లో బయట పెడతామన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు ఒక ప్రాంతానికే పరిమితం అయిపోయి ప్రజల కోసం కాకుండా స్వార్థ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బొమ్మి ఇజ్రాయిల్ సంచలన వ్యాఖ్యలు చేసారు.

# మహాశివరాత్రి ఉత్సవాల మీద సమీక్ష సమావేశం



**సామర్లకోట, మేజర్‌న్యూస్ :** పంచారామ క్షేత్రాల్లో ఒకటైన సామర్లకోట కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 13 నుండి నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆలయ కార్య నిర్వాహణ అధికారి బళ్ల నీలకంఠం, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొని మహా శివరాత్రికి సంబంధించి స్వామివారి కళ్యాణం, రథోత్సవం, శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తుల దర్శనాలు లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తీసుకునే జాగ్రత్తలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఏ.శ్రీవిద్య, టీడీపీ నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, సరోజ వాసు, వాడపర్తి భద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాద్, తాటిపూడి అరుణ్ వంశీ, గోర్తి సత్యనారాయణ, మానవహక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, అత్తిలి కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'గణతంత్ర' వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**– గ్రౌండ్ పరిశీలించిన ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** నూతన పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంలో గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఈనెల 26 తేదీన జరుగు గణతంత్ర దినోత్సవం వేడుకలు ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ సోమవారం రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలవరం నూతన జిల్లా ఏర్పాటు అయిన తర్వాత మొదటి గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల అభివృద్ధి శకటాలు, స్టాల్స్, అదేవిధంగా ప్రజా ప్రతినిధులకు, పాత్రికేయులకు, అవార్డు గ్రహీతలకు వేరువేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

అలాగే వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో కల్చరల్ ప్రోగ్రాములు, పోలీస్ కవాతు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. పోలవరం జిల్లా రంపచోడవరంలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు అందరూ ఆహ్వానితులని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి.సాయి ప్రశాంత్, ఆర్మూర్ రిజర్వ్ డి.ఎస్.పి సీతారాం, తహసిల్దార్ పి.బాలాజీ, ఐటీడీఏ ఇంచార్జి ఏవో వై.రాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వెంకటరమణ, డిఇలు చైతన్య, మల్లికార్జున రావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ మిరియాల లక్ష్మణ్, ఎంఈఓ శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ స్వామి నాయుడు, ఈఈ శ్రీనివాసరావు, లైన్ ఇన్స్పెక్టర్ కె.బాపిరాజు దొర, మండల సర్వేయర్ యం.లక్ష్మణ్, ఫిజికల్ డైరెక్టర్ కె.పోతురాజు, పిఈటీ లు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో వెంకన్న హుండీ ఆదాయం

**– 34 రోజులకు రూ.2,05,51,004లు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. 34 రోజుల కాలానికి రూ.2,05,51,004 లు హుండీ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే బంగారం 26 గ్రాములు, వెండి 1 కేజీ 200 గ్రాములు, అలాగే 14 దేశాలకు సంబంధించి 87 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ ఏవి దుర్గా భవాని, తనిఖీదారుగా ఈవో లు ఎస్.టి.పి.టి. శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పెండ్యాల భవాని, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయి ప్రసాద్, శిష్ట సూర్య కుటుంబరావు,



మసకపల్లి త్రిమూర్తులు హాజరయ్యారు. అలాగే అర్చకస్వాములు, వేదపండితులు, గ్రామస్థులు, శ్రీవారి సేవకులు, పత్రికా ప్రతినిధులు, పోలీసులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేసిన యుటిఎఫ్



**కూనవరం,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విద్యాసంవత్సరం మార్చిలో జరిగే వార్షిక పరీక్షల్లో విద్యార్థులందరు ఉత్తీర్ణత సాధించాలి ఉద్దేశంతో యుటిఎఫ్.10వ తరగతి మోడల్ పేపర్స్ ముద్రించి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి అందజేయడం జరుగుతుంది. అందులో భాగంగా కూనవరం మండల కేంద్రంలోని ¬ా+ూా నర్సింగపేట పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటున్న 62 మంది ×అజవర్‌అస్త్రఖ్‌అశీఅ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరభద్రమ్మ మరియు యుటిఎఫ్.కూనవరం మండల ప్రధాన కార్యదర్శులు పి. కన్నారావు, వి. ఆర్. పురం మండల ప్రధాన కార్యదర్శి వెంకటచారి చేతుల్లో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్. మండల ప్రధాన కార్యదర్శి పి. కన్నారావు మాట్లాడుతూ విద్యార్థులందరు మంచి మార్కులు సాధించడానికి ఉపయోగపడుతుందని దాదాపు ప్రతి సంవత్సరం ఈ మోడల్ పేపర్లో నుండి 70 నుండి 80 శాతం వరకు వచ్చే అవకాశాలు ఉంటాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కారం. కాంతమ్మ, రీనా రాయ్, కౌసల్య, సీతమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద బాలుడికి అండగా కిమ్స్

**– మానవత్వం చాటుకున్న చైతన్యరాజు**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** వైద్యం అనేది వ్యాపారం మాత్రమే కాదు, అదొక పవిత్రమైన సేవ అని అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ కలిదిండి సత్యనారాయణ రాజు చైతన్య రాజు మరోసారి నిరూపించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక నిరుపేద పేషెంట్ పట్ల ఆయన చూపిన ఉదారత కోనసీమ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే...బోడసకుర్రు పల్లిపాలెం గ్రామానికి చెందిన చింతా నాగేశ్వరరావు కుమారుడు చింత యశ్వంత్ గత 45 రోజులుగా తీవ్ర అనారోగ్యంతో అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సుదీర్ఘ కాలం చికిత్స అందడంతో



ఆసుపత్రి బిల్లులు ఆ పేద కుటుం బానికి భారంగా మారాయి. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబ పరిస్థి తిని గమనించిన డాక్టర్ చైతన్య రాజు మానవతా దృక్పథంతో స్పందించి హాస్పిటల్ బిల్లులో భారీ రాయితీని కల్పించారు. మెరుగైన వైద్యం అందించడమే కాకుండా, బిల్లు విషయంలో అండగా నిలవడంతో ఆ కుటుంబం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా యశ్వంత్ తండ్రి చింత కనకరాజు మాట్లాడుతూ.. "మా కుమారుడిని బతికించడమే కాకుండా, మా ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని బిల్లు తగ్గించిన చైతన్య రాజు గారు మా పాలిట 'కనిపించే దేవుడు'. మా కుటుంబాన్ని ఆదుకున్న ఆయనకు పాదాభివందనాలు తెలియజేస్తున్నాం" అని భావోద్వేగానికి లోనయ్యారు.

తమకు అండగా నిలిచిన కిమ్స్ చైర్మన్ డాక్టర్ చైతన్య రాజుతో పాటు, ఆసుపత్రి నిర్వహణలో కీలక పాత్ర పోషించిన రాయ్, సురేష్ కి మరియు ఈ విషయంలో తమకు ఎంతగానో సహకరించిన బిజెపి నాయకులు మోకా వెంకట సుబ్బారావుకు యశ్వంత్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆపదలో ఉన్న పేషెంట్లకు అండగా నిలుస్తున్న చైతన్య రాజు లాంటి వ్యక్తులు ఉండటం కోనసీమ ప్రాంతానికి గర్వకారణమని స్థానికులు కొనియాడుతున్నారు.

## పశువుల రక్షణ పట్ల జాగ్రత్తలు వహించాలి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సీజనల్ వ్యాధుల బారిన పశువులు పడకుండా సంరక్షించడానికి పాడి పశువుల రైతులు జాగ్రత్తలు వహించాలని కాండ్రకోట పశు వైద్యురాలు డా.గంగాభవాని తెలిపారు. బుధవారం పశువైద్యశాల నందు పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా 77 గేదెలకు, 36 ఆవులకు నట్టల నివారణ మందులు, జలగ మందులు, పాముల మందులు, పాడి పశువులకు మరియు దూడలకు పట్టించడం జరిగింది. డా.ఎం.గంగాభవాని తెలుపుతూ ఈ పశు ఆరోగ్య శిబిరాలను పాడి పశువుల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అబ్దుల్ రియాజ్, సుధీర్, రాజ్‌కుమార్, రైతుల పాల్గొన్నారు.

## నిర్భందాలతో ఉద్యమాలను అణచలేరు




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేయబోతున్న బల్క్ డ్రగ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు అండగా నిలబడిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్ట్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని, పెద్దాపురం సిపిఎం మండల కన్వీనర్ డి.క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం యాసలపు సూర్యారావు భవనంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు నీలపాల సూరిబాబు, సిపిఎం నాయకులు ఎస్.శ్రీనివాస్, కేదారి నాగుతో కలసి ప్రభుత్వ నిర్బందాలపై పోస్టర్ ఆవిష్కరణ చేశారు. తక్షణం అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్ట్‌ను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల నుండి తీవ్ర ప్రతిఘటన కూటమి ప్రభుత్వం ఎదుర్కోవలసి ఉంటుందని వారు హెచ్చరించారు.

## టీ- యాప్ ద్వారా జీవన్ ప్రమాణం సర్టిఫికెట్లు అందజేత



**చింతూరు, మేజర్ న్యూస్:** చింతూరు మండల కేంద్రంలోని ఎర్రంపేటలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చింతూరు యూనిట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్కే బడేమియా పర్యవేక్షణలో లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు నిర్వహించి మీసేవ, టీ యాప్ జీవన ప్రమాణం డిజిటల్ విధానం ద్వారా చింతూరు, చట్టి, మోతుగూడెం పరిసర ప్రాంతాలకు సంబంధించిన సుమారు 50 మంది ఫ్యామిలీ మరియు సర్వీస్ పెన్షనర్లకు ఐడెంటిఫికేషన్ కేటాయించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షులు జి.భూషణ్ రావు, కార్యదర్శి మధుసూదన్ రావు, అసోసియేషన్ అధ్యక్షులు జి.వెంకన్న, ఉపాధ్యక్షులు రాంచంద్రరావు, జి.వి.రామారావు, చిన్నయ్య, ఎం.చారి, కే.వెంకటలక్ష్మి, డిజిటల్ సేవ విఎల్ఈ జి.శివబాబు తదితరులు పాల్గొన్నారు.

# 25న రథసప్తమి : గోవిందగిరిపై ప్రత్యేక ఉత్సవాలు





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఈనెల 25వ తేదీన రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు నిర్వహిస్తున్న గోవింద గిరిపై శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అధికారులు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా స్వామివారికి తిరుమాడ వీధి ఉత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు రూప్ సాయి మీడియాకు తెలియజేశారు.

ఈ తిరుమాడ వీధి ఉత్సవం ఉదయం 9.00 గంటల నుండి ప్రారంభమై, శాస్త్రోక్త విధానంలో స్వామివారి రథ విహారం భక్తుల సమక్షంలో నిర్వహించబడుతుందన్నారు. స్వామివారు తిరుచ్చి వాహనంలో తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారని తెలిపారు. రథసప్తమి హిందూ ధర్మంలో అత్యంత పుణ్యప్రదమైన పర్వదినమని, సూర్యదేవుడు రథారూఢుడై ఉత్తరాయణ గమనంలో ప్రవేశించిన శుభసందర్భంగా ఈ పర్వదినాన్ని ఆచరిస్తారని పేర్కొన్నారు. అ రోజు స్వామివారిని తిరుచ్చి వాహనంలో (రథస్థంగా) దర్శించుకోవడం ద్వారా సకల పాప విమోచనమై, ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయని శాస్త్రోక్త విశ్వాసం."రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మన విద్యతే" అనగా, రథంపై విహరించే కేశవుని దర్శించుకున్న వారికి పునర్జన్మ ఉండదని శాస్త్రాలు పేర్కొంటున్నాయని ఆలయ అర్చకులు దీవి పార్ధు స్వామి, గోవర్ధన మణికంఠ స్వామి తెలిపారు. రథసప్తమి ప్రాముఖ్యత, ఉత్సవాల ఆధ్యాత్మిక విశేషాలు, శాస్త్రోక్త అర్థాలను వారు భక్తులకు వివరించారు.

ఈ పవిత్ర రథసప్తమి ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అనుగ్రహాన్ని పొందవలసిందిగా ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, ఐ.పోలవరం గోవిందగిరి క్షేత్రం దర్శన విశేషం వివరించారు. 9 శనివారములు 11 ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శిస్తే కోరిన కోర్కెలు కొంగు బంగారంగా స్వామి అనుగ్రహిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రతీ రోజు భక్తులు ఇచ్చిన విరాళాలతో మధ్యాహ్నం 12:30 నుండి నిత్యాన్నదానం (ప్రసాద వితరణ) జరుగుతుంది. భక్తులు తమ పుట్టినరోజు, పిల్లలు పుట్టిన రోజు, తమ పెద్దలు తిథులలో అన్న ప్రసాద వితరణ చేయదలచినవారు ఆలయ అధికారులను సంప్రదించాలని ఆలయ అధికారి ఇ.రూప్ సాయి విజ్ఞప్తి చేసారు.

# జనసేన పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుంది -ఎమ్మెల్యే బొలిశెట్టి



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన నేత పరుపుల తమ్మయ్య బాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు బుధవారం ఆయన ఏలేశ్వరం మండలంలో లింగంపర్తి గ్రామానికి విచ్చేశారు. తొలుత స్థానిక సెంటర్లో ఏర్పాటుచేసిన తమ్మయ్య బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య దుర్గవేణి, కుమారుడు సాయికిరణ్, కుమార్తె అశ్లేషలను కలిసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీలో పనిచేస్తున్న కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. పార్టీలో చురుగ్గా పాల్గొనే తమ్మయ్య బాబుని కోల్పోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జనసేన పార్టీ పెద్దలతో చర్చించి అన్నయ్య బాబు కుటుంబానికి సముచిత స్థానం దక్కేలా తమవంతుగా కృషిచేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు.

# ఏపీఎస్ఆర్టీసీ కొరియర్ ఏజెంట్‌గా పోస్టల్ ఉద్యోగి




**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పార్సిల్ అండ్ కొరియర్ సర్వీస్ ఏజెంట్‌గా పోస్టల్ ఉద్యోగి టెండర్ చేజిక్కించుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఏలేశ్వరం పోస్ట్ ఆఫీస్ కార్యాలయం పరిధిలో ఉన్న తిరుమలి గ్రామంలో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ( ఏ బి పి ఎం)గా పొట్నూరి వంశీ విధులు నిర్వహిస్తున్నాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధన ప్రకారం ఉద్యోగులు ఎటువంటి టెండర్ల ప్రక్రియలో పాల్గొనరాదని అధికారులు చెబుతున్నారు. అయితే ఇటీవల కాలంలో జగ్గంపేట పరిధిలో ఉన్న ఏపీఎస?ర్టీసీ పార్సిల్ అండ్ కొరియర్ వ్యాపారానికి ఆర్టీసీ అధికారులు టెండర్ లో పిలవడం జరిగింది. ఈ టెండర్‌లో అధిక మొత్తం సొమ్ము వేసుకొని వంశీ టెండర్ చేజిక్కించుకున్నాడు. ఇటు ఆర్టీసీ అధికారులకు అటు పోస్టల్ అధికారులకు ఈ విషయం తెలిసిన పట్టించుకోవడంలేదని పలు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో అధికారులకు వంశీ సొమ్ములు ముట్ట చెప్పాడన్న విమర్శ కూడా వస్తుంది. ఏపీఎస?ర్టీసీ కొరియర్ టెండర్ కారణంగా పోస్టల్ కొరియర్ వ్యాపారం తగ్గుతుందని ప్రజల అభిప్రాయపడుతున్నారు. . ఇప్పటికే పోస్టల్ డిపార్ట్మెంట్ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ముఖ్య ఉద్దేశంతో ఉన్నతాధికారులు దృష్టి పెడుతున్నారు. ఇప్పటికైనా పోస్టల్ అధికారులు స్పందించి దీనిపై సరైన దర్యాప్తు నిర్వహించి పోస్టర్ అభివృద్ధికి తోడ్పడతారని ప్రజలు కోరుతున్నారు.

# బిల్డింగ్ స్లాబ్ ప్రమాదంలో వ్యక్తి మృతి



– ముగ్గురికి గాయాలు

**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి సాయిబాబా టెంపుల్ పక్కన మురుగునీరు గోదావరిలోకి పంప్ చేయుటకు నిర్మాణంలో వున్న లిఫ్ట్ ఇరిగేషన్ బిల్డింగ్ రెండవ స్లాబ్ వేస్తుండగా ఆ స్లాబ్ యొక్క సపోర్టింగ్ జాకీలు ఫెయిల్ అవ్వడం వల్ల అందులో పని చేసే ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలు అయ్యాయి. సుబ్బాయమ్మపేటకి చెందిన కేతమళ్ళ వెంకటేష్ 50సంవత్సరాలు గల వ్యక్తి చనిపోయాడు. ఈ ప్రమాద ంలో దొడ్డి బాల కిషోర్, రామాటి రాజు, వల్లిపు సింహాద్రికి గాయాలు అయ్యాయని ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సిఐ గణేష్ తెలిపారు.

# అదుపుతప్పి కారు బోల్తా



– ఇద్దరికీ తీవ్ర గాయాలు


**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ అడ్డతీగల మండలంలోని గవరయ్యపేట గ్రామ సమీపంలోని నూతన జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద బుధవారం కారు అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకు వెళ్లడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే అల్లూరి సీతారామరాజు జిల్లా కేడీపేట సమీపంలోని నడింపాలెం గ్రామానికి చెందిన పందల శివ పాలపర్తి సత్యనారాయణ అనే ఇద్దరు యువకులు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా పోలవరం జిల్లా అడ్డతీగల మండలం గవరయ్యపేట గ్రామ సమీపంలోకి వచ్చేసరికి వేగం వల్ల కారు అదుపు తప్పడంతో కల్వర్టు పైనుంచి గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు కారులో ఉన్న ఇద్దరు తీవ్ర గాయాలు పాలయ్యారు. పందల శివ అనే వ్యక్తికి కుడి చెయ్యి విరిగిపోగా పాలపర్తి సత్యనారాయణ వ్యక్తికి నడుము వద్ద తీవ్ర గాయం అయింది. చుట్టుపక్కల స్థానికులు వీరిని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించగా ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బ్యాంకు భీమా పథకాలపై అవగాహన



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** బుధవారం మండల కేంద్రమైన అడ్డతీగలలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు మండలంలోని చిరు వ్యాపారస్తులకు బ్యాంకు వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పనిచేస్తున్న వివిధ రకాల బ్యాంకుల్లో అమలు చేస్తున్న భీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల ఎంపీడీవో కుమార్ పర్యవేక్షణలో వెలుగు ఏపిఎం అప్పారావు ఆర్థిక అక్షరాస్యతా సంఘం కౌన్సిలర్స్ కౌన్సిలర్స్ సుకుమార్, విశ్వనాథ్, అనిల్ అవగాహన సదస్సుకు హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమ యోజన, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ప్రతి ఒక్కరు కష్టకాలంలో ఆర్థిక భరోసా పొందవచ్చని తెలిపారు. అతి తక్కువ ప్రీమియంతో సర్వకాల సర్వావస్థలోనూ ప్రభుత్వ రాయితీలు పొందడమే కాకుండా చేసే చిన్న చిన్న వ్యాపారాలకు సైతం రుణ సదుపాయాలు కూడా బ్యాంకుల ద్వారా తీసుకోవచ్చని వెల్లడించారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్కరు వినియోగించుకొని లబ్ధి పొందాలని ఆకాంక్షించారు.

# బూసిగూడెంలో శిథిలావస్థలో హెల్త్ సెంటర్ భవనం


**- ఎస్టీ కమీషన్ చైర్మన్‌ను వివరించిన గిరిజనులు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** తమ గ్రామంలో హెల్త్ సెంటర్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేసారు. రంపచోడవరం మండలం బూసిగూడెం గ్రామంలోని ప్రభుత్వ హెల్త్ సెంటర్?ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య అధికారులు హెల్త్ సెంటర్ లో ప్రస్తుత పరిస్థితిని చైర్మన్ కు వివరించారు. బూసిగూడెం గ్రామంలోని హెల్త్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, మౌలిక సదుపాయాల లోపం తీవ్రంగా ఉందని ప్రజలు తెలిపారు. అలాగే హెల్త్ సెంటర్?లో వైద్య సిబ్బంది కొరత, ముఖ్యంగా ఎఎనచవతీతీచంలు లేకపోవడం వల్ల వైద్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్టీ కమీషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ హెల్త్ సెంటర్?లో వైద్య అధికారులు, సిబ్బంది సరిగా సేవలు అందించడం లేదని, వైద్య సౌకర్యాలు ఏమాత్రం అందడం లేవని చైర్మన్ కు విన్నవించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకొని ఎస్టీ కమీషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అంతేకాకుండా హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది కొరత తీరుస్తామని, అవసరమైతే నూతన హెల్త్ సెంటర్ భవనం నిర్మాణానికి కావలసిన చర్యలు చేపడతామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి తెలిపారు.

# ఎమ్మెల్యేచే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



సామర్లకోట,మేజర్‌న్యూస్ : ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను కల్పిస్తుందని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప పేర్కొన్నారు. సామర్లకోట మండలం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే చినరాజప్ప చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యంపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నియోజకవర్గంలోని 54 మందికి సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు కాగా ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, నూనె రామారావు, చల్లా బుజ్జి, తదితర టిడిపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ మేనేజర్‌గా రవికుమార్



**సామర్లకోట, మేజర్‌న్యూస్ :** సామర్లకోట మున్సిపాలిటీ మేనేజర్‌గా బి.రవి కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సామర్లకోట మున్సిపాలిటీలో గత కొంత కాలంగా మేనేజర్ పోస్ట్ ఖాళీగా ఉన్నది. ఈనేపథ్యంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న రవి కుమార్‌కు పదోన్నతి లభించడంతో సామర్లకోట మున్సిపాలిటీలోనే మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1995లో జూనియర్ అసిస్టెంట్‌గా పెద్దాపురం మున్సిపాలిటీలో తొలుత విధులు నిర్వహించి అనంతరం తుని, మండపేట మరియు పెద్దాపురం మున్సిపాలిటీల్లో పని చేసినట్లు తెలిపారు.

సామార్లకోట మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రవి రవికుమార్‌కు పదోన్నత లభించడంతో మేనేజర్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రవికుమార్ను అభినందించారు.

# ఏలేశ్వరం, జె.అన్నవరం రోడ్డు పునఃనిర్మాణం కోరుతూ సిపిఎం మహాధర్నా



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** దశాబ్ద కాలం పైబడి శిథిలా వ్యవస్థకు చేరుకున్న ఏలేశ్వరం మండలం రమణయ్యపేట-జె అన్నవరం ఆర్ అండ్ బి రహదారి పునర్నిర్మాణాలు కోరుతూ సిపిఎం అనుబంధ సంఘాలు గురువారం మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు తెలిపారు. అడ్డతీగల మండలం గుంటువానిపాలెం ఏలేశ్వరం మండలం రమణయ్యపేట ఆర్ అండ్ బి రహదారిపై ధర్నా, రాస్తారోకో, వంటావార్పు నిర్వహిస్తామన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో రహదారులు నిర్మిస్తున్నామని డప్పు కొట్టుకునే కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి అయిన రమణయ్యపేట-జె అన్నవరం రహదారి ఎందుకు పునర్నిర్మించటం లేదని ప్రశ్నించారు. ఈరోడ్డుపై ప్రయాణించాలంటేనే గిరిజన ప్రజలు బెంబేలెత్తుతున్నారని అన్నారు. 20 నిమిషాల్లో ప్రయాణించవలసిన 12 కిలోమీటర్లు రోడ్డుపై వెళ్లాలంటే గంట సమయం పడుతుంది అన్నారు. వాహనాలు మరమ్మత్తులు గురికావడమే కాకుండా అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ రహదారిపై గిరిజనులను వైద్య నిమిత్తం పట్టణ తరలించే అంబులెన్సులు సైతం మరమ్మత్తులకు గురై గిరిజనులు అంబులెన్స్‌లోనే ప్రసవించడం, ప్రాణ సంకటంగా మారిందన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీన 12 గంటల పాటు ఆందోళన నిర్వహించగా ఐ టి డి ఏ పి ఓ స్మరణ్ రాజ్ సెప్టెంబర్ 28వ తేదీలోగా ప్రస్తుత కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకపోతే కాంట్రాక్టర్ రద్దు చేసి వెంటనే నూతన కాంట్రాక్టర్‌తో పనులు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆమె ఇచ్చి ఐదు నెలల కాలం పూర్తవుతున్న రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో గిరిజన సంఘాలు, పలు ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధుల సహకారంతో రోడ్డు నిర్మాణం సహకారం అయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిఠాపురం మండలం పి.దొంతమూరు, పి.తిమ్మాపురం, పి.రాయవరం, జములపల్లి మరియు కందరాడ గ్రామాలలో గల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర?ఫ్) చెక్కులను పంపిణీ చేశారు. సుమారు 6 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందని, ఎన్నికలు ముందు హామీ ఇచ్చిన ప్రకారం ఇంట్లో పెద్ద కొడుకుగా ఉంటూ వైద్యం ఖర్చుల నిమిత్తం ఆదుకుంటూన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సకుమల్ల గంగాధర్ రావు, బర్ల అప్పారావు, బెజవాడ సురేష్, అంబటి మూర్తి, పిల్లా సురేష్ మరియు పార్టీ నేతలు పాల్గొన్నారు.

# కీలక పాత్ర పోషించేది మీరే..

**- ఎమ్మెల్యే జ్యోతుల**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జిల్లాలో కీలక పాత్ర పోషించేది జగ్గంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలేనని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రు అన్నారు. స్థానిక నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పిబ్రవరి 1న కాకినాడలో టిడిపి జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం జరుగుతుందని నియోజకవర్గం నుండి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం



అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఈ నెల 29.01.2026 (గురువారం) నాడు జరగనున్న భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం సర్వసన్నద్ధమైంది. ఈ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఈవో వేంద్ర త్రినాధరావు అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ అర్చకులు సమన్వయంతో వ్యవహరించి, శ్రీ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్వరితగతిన దర్శనం కల్పించాలని. భీష్మ ఏకాదశి నాడు వ్రతాలు ఆచరించే భక్తుల సంఖ్య అత్యధికంగా ఉంటుంది. వ్రత మండపాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, క్రమ పద్ధతిలో వ్రతాలు నిర్వహించాలని పురోహితులను ఆదేశించారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, ప్రసాదం మరియు భద్రతా విభాగాలు నిరంతరం భక్తులకు అందుబాటులో ఉండాలి. ప్రతి సెక్షన్ వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి భక్తుల సౌకర్యార్థం కృషి చేయాలి. ట్రాఫిక్ మరియు క్యూ లైన్లు కొండపైకి వచ్చే భక్తుల వాహనాల రద్దీని నియంత్రించాలని, క్యూ లైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రత్నగిరిపై శ్రీ సత్యదేవుని దర్శించుకునే భక్తులందరికీ ఆహ్లాదకరమైన మరియు భక్తిపూర్వకమైన వాతావరణం కల్పించడమే దేవస్థానం ప్రథమ లక్ష్యమని ఈఓ వేంద్ర త్రినాధరావు స్పష్టం చేశారు. భక్తులు దేవస్థాన నియమ నిబంధనలు పాటిస్తూ, సిబ్బందికి సహకరించి శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరడమైనది.